క్లుప్తంగా

శ్మశానవాటిక ఏర్పాటు



శ్మశానవాటిక స్థలం వద్ద గ్రామస్తులు

పాల్వంచరూరల్: మండలంలోని శేఖరంబంజర వాసులు నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేసుకుని, శ్మశానవాటికను ఏర్పాటు చేసుకున్నారు. 16వ వార్డు నవభారత్ శేఖరంబంజర గ్రామం ఆవిర్భవించినప్పటి నుంచి శ్మశానవాటిక లేక దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బందికరంగా మారింది. దీంతో స్థానికులు కలిసి సోమవారం గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని గుర్తించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో బానోతు బాలునాయక్, సామానాయక్, సురేశ్‌నాయక్, గుగులోతు బాలు, రాజు, కిషోర్, రవి, శేఖర్, అనిల్, వెంకటేశ్, లింగయ్య, లాలు, రాజేశ్ పాల్గొన్నారు.

నేడు మొక్కజొన్న కొనుగోలు ధరపై చర్చ

ఇల్లెందురూరల్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు స్థానికంగా వ్యాపారులకు మొక్కజొన్న పంటను విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ధరతో వారు కొనుగోలు చేస్తుండటం రైతులను నష్టాలకు గురిచేస్తోంది. దీంతో మండలంలోని న్యూడెమోక్రసీ, మాస్ లైన్ నాయకులు మొక్కజొన్న పంటకు ధరను నిర్ణయించేందుకు మంగళవారం ఏజెన్సీ గ్రామాలకు చెందిన వ్యాపారులతో పోలారం గ్రామంలో చర్చలు చేయనున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే అదనంగా ఉండేలా, రైతులకు నష్టం జరగకుండా, వ్యాపారులకు గిట్టుబాటు అయ్యేలా ధరను నిర్ణయించి వ్యాపారులంతా అదే ధరకు కొనుగోలు చేసేలా చర్చించనున్నట్లు ప్రతినిధులు బానోత్ సంతు, బుర్ర రాఘవులు తెలిపారు.

చలివేంద్రాలు ప్రారంభం

టేకులపల్లి: రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి అన్నారు. సోమవారం బటేకులపల్లి పంచాయతీ కార్యాలయం, బోడు క్రాస్‌రోడ్ వద్ద రెండు చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో నోముల కళావతి, నోముల భానుచందర్, సుజాత, నాగమణి, ఉమ, ఎస్.నరేశ్, చంద్రమౌళి, యం.సతీశ్, బి.నరేశ్, మూడు బిచ్చు, ప్రసాద్, చందు తదితరులు పాల్గొన్నారు.

మే 20న టోకెన్ సమ్మె

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, అందుకు నిరసనగా మే 20న సింగరేణిలో ఒకరోజు టోకెన్ సమ్మె నిర్వహించనున్నామని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని వారు కోరారు

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ఇల్లెందురూరల్: గ్రామ పంచాయతీ వర్కర్లకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని వాపోయారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని పంచాయతీల్లో పనివేళలు మార్చాలని కోరారు. కార్యక్రమంలో గౌని నాగేశ్వరరావు, సామేలు, నర్సింహారావు, కుంజ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): రంజాన్ పండుగ సందర్భంగా బస్తీలు, గ్రామాల్లో ఏర్పాట్లు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వీధుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈద్గాలు, మసీదుల ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

నేడు సంత వేలం

టేకులపల్లి: మండలంలోని టేకులపల్లి, గోల్యాతండా పంచాయతీల సంయుక్త వారాంతపు సంత వేలం పాట మంగళవారం ఉదయం 11 గంటలకు టేకులపల్లి పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు ఉప్పు దీప్తి, ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

108లో ప్రసవం

టేకులపల్లి: మండలంలోని కొప్పురాయి పంచాయతీ ఇప్పలచెలకకు చెందిన ఈ.సునీతకు పురిటినొప్పులు రావడంతో సులానగర్ పీహెచ్‌సీ నుంచి రామవరం ఎంసీహెచ్‌కు 108లో తరలిస్తున్నారు. మధ్యలో నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ అశోక్, పైలట్ నాగేశ్వర్‌రావు సుఖ ప్రసవం చేశారు.

బోసిపోయిన ‘లేక్ వ్యూ’

సెలవులొస్తున్న వేళ ఆహ్లాదానికి అడ్డా కరువు

- పార్కులో ఎండిపోయిన మొక్కలు
- నీరే కానరాని ఈత కొలను..
- మూణ్నాళ్ల ముచ్చటగా మారిన వినోదం



మొక్కలు ఎండిపోయి, టైల్స్ ఊడిపడడంతో కళ కోల్పోయిన పార్క్

ఇల్లెందు: పట్టణ ప్రజలకు ఏకైక వినోదం, ఆహ్లాదం అందించే లేక్ వ్యూపార్క్ బోసిపోతోంది. వేసవి సెలవులు సమీపిస్తున్న వేళ పిల్లలకు ఆహ్లాదాన్ని అందించడమే కాక ఈత నేర్చుకునేందుకు నిర్దేశించిన పార్క్‌లో ఇప్పుడు ఆ పరిస్థితులు కానరావడం లేదు. ఎక్కడి పారిశుద్ధ్యం అక్కడే అన్న చందంగా మారింది. మొక్కలు ఎండిపోయి ఆట వస్తువులు విసిరేసినట్లుగా పడిపోయి ఆరు నెలలకే అందవిహీనంగా మారింది. మరోపక్క రూ.కోటి నిధులతో ఏర్పాటు చేసిన ఈత కొలను నీరంతా తొలగించి మరమ్మతుల్లో ఉందని బోర్డు పెట్టేసి చేతులు దులుపుకున్నారు.

నెలరోజులు రద్దీ

ఇల్లెందులో ఈత కొలను ప్రారంభించిన నెల పాటు మంచి ఆదరణ లభించింది. ఒకే రోజు సుమారు రూ.10 వేల వరకు ఫీజు రూపంలో ఆదాయం నమోదైంది. ఇలా మంచి ఆదరణ లభిస్తున్న వేళ కొలనులో నీరు తొలగించడంతో 15 రోజులుగా బోసిపోయి కనిపిస్తోంది. అయితే, ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ముగియగా.. పదో తరగతి పరీక్షలు త్వరలో ముగియనున్నాయి. ఈ సమయాన ఈత నేర్చుకోవాలని ఆసక్తి కనబర్చిన విద్యార్థులకు అధికారుల తీరుతో నిరాశ ఎదురైంది. దీంతో ప్రతీరోజు లేక్ వ్యూ పార్క్ వద్దకు వచ్చి చూసి వెళ్తున్నారు. అయితే, ఈత కొలను చుట్టూ రక్షణ చర్యలు లేనందున ఫెన్సింగ్ ఏర్పాటుచేసే వరకు ఎవరినీ అనుమతించొద్దనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ, టెండర్లు ఆహ్వానించి, ఫెన్సింగ్ బిగించేలోగా వేసవి సెలవులు ముగిస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం

పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచే లేక్ వ్యూ పార్క్‌లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడి చెత్త అక్కడే అన్న చందంగా వదిలేయడంతో తాగి పడేసిన గ్లాసులు, బాటిళ్లు కనిపిస్తున్నాయి. అయితే, మున్సిపల్ పాలకవర్గం గడువు ముగియడం.. అధికారులు ఇతర పనుల్లో బిజీగా ఉండి పర్యవేక్షణ కరువై పార్క్ పరిస్థితి ఇలా మారిందనే విమర్శలు వస్తున్నాయి.



నీరు లేని ఈత కొలను

ఉపయోగంలోకి తీసుకురావాలి..



15 రోజులుగా కొలనులో నీరు తీసేశారు. మొదట్లో మంచిగా ఉండడంతో ఇక్కడకు వచ్చేవాళ్లం. ఇప్పుడు నీరు లేక ప్రతిరోజు చూసి వెళ్తున్నాం. సెలవులు మొదలయ్యేనాటికైనా కొలనులో నీళ్లు వస్తాయో, రావో తెలియడం లేదు.

–ఎ.జశ్వంత్, విద్యార్థి, ఇల్లెందు

పార్క్‌ను అభివృద్ధి చేయాలి



పట్టణంలో ఏకైక పార్క్‌ను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలి. గంట, రెండు గంటలు పార్క్‌లో సేద తీరేలా వచ్చే వారికోసం పచ్చిక బయళ్లు, మొక్కలు పెంచాలి. అలాగే, పారిశుద్ధ్య నిర్వహణపై మున్సిపల్ అధికారులు దృష్టి సారిస్తే మేలు జరుగుతుంది.

–బయ్య అభిమన్యు, ఇల్లెందు

రక్షణ చర్యల కోసమే..



ఈత కొలను వద్ద రక్షణ చర్యలు సరిగ్గా లేవు. అంతేకాక మురికి నీరు పెరిగింది. దీంతో అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందుకే నీరు తొలగించి ఇతర చర్యలు చేపడుతున్నాం. మరో వారం రోజుల్లో ఈత కొలనును అందుబాటులోకి తెస్తాం.

–సీహెచ్.శ్రీకాంత్, కమిషనర్, ఇల్లెందు

ఇళ్ల స్థలాల ఉద్యమానికి మద్దతు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధనలో భాగస్వాములమవుతామని, ఎలాంటి కార్యక్రమానికైనా బీఆర్‌ఎస్ ముందుంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హామీ ఇచ్చారు. జర్నలిస్టులు నిర్వహిస్తున్న నిరసన శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా వారిలో ఎవరో ఒకరు చొరవ తీసుకొని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. గతంలో బీఆర్‌ఎస్ ఇళ్ల స్థలాలను కేటాయించిందని, స్థలాన్ని అప్పగించే బాధ్యత కూడా తీసుకొని తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం కూడా ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రత్యేక జీఓ తీసుకొచ్చి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. కాగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జాతీయ సలహాదారులు మిట్టపల్లి సాంబయ్య, జిల్లా అధ్యక్షులు అంకినీడు ప్రసాద్, నిర్భయ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల ఉషారాణి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, తెలంగాణ ట్రైబల్ టీచర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు హతీరాం, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌నాయక్, సేవాలాల్ బంజారా సేన రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌నాయక్, ధర్మ సమాజ్ పార్టీ బీజేపీ మండల కార్యదర్శి సురేశ్‌తో పాటు పలు సంఘాల నాయకులు నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని కోరుతూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ (టీవీఏసీ) జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్మాణ కార్మికులను, కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి తీసుకుందని, కానీ, వారికి ఉద్యోగ భద్రత, పదోన్నతులు, సౌకర్యాలు లేక పోవడంతో వేతనాలు అంతంత మాత్రంగానే ఉండటంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఈశ్వరరావు, కన్వీనర్ ఎంఏ వజీర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న చిలుకూరి రమేశ్

జూలూరుపాడు: అప్పు తీసుకున్న ప్రతి రైతుకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం జూలూరుపాడులో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో అప్పు ఉన్న ప్రతి రైతుకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ఉందని, 65 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉండగా కేవలం 20 లక్షల మంది రైతులకు మాత్రమే చేసిందన్నారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నున్నా రమేశ్, తెల్లం నరసింహారావు, సిరిపురపు ప్రసాద్, భూక్యా రమేశ్, భూక్యా రవి, నిమ్మటూరి రామారావు, సిరిపురపు గోపాల్‌రావు, నర్వనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బేతంపూడి దర్గాలో సామగ్రి పంపిణీ



బట్టలు పంపిణీ చేస్తున్న దర్గా బాధ్యులు

టేకులపల్లి: రంజాన్ పండుగను పురస్కరించుకుని బేతంపూడి దర్గా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సామగ్రి వితరణ చేశారు. తొలుత గ్రామస్తులకు, నిరుపేదలకు ఇఫ్తార్ విందు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్గా కమిటీ ఆధ్వర్యంలో రంగురాళ్లబోడు, వెంకట్యాతండా, బేతంపూడి, అబ్బిరెడ్డిగూడెం, కోయగూడెం గ్రామాలకు చెందిన 32 నిరుపేద కుటుంబాలకు జిల్లా నాయకుడు కోరం సురేందర్ చేతుల మీదుగా సామగ్రి పంపిణీ చేశారు. షేక్ రఫీ, షఫీ, జానీ, ఖాజామోహిద్దీన్, జమాల్, ఖయ్యూమ్, పాషా, షకీల్, హసిమ్, సలీం, జావేద్, ఈది గణేశ్, బాబు, పోషాలు, రెడ్యానాయక్, భద్రు, సర్దార్, బానోత్ రవి, మంగీలాల్, దొండ నర్సింహారావు, శివలాల్, నర్సింహారావు, నవీన్, మహేశ్, సమ్మయ్య, అనిల్, లింగయ్య, సుధీప్ పాల్గొన్నారు.

ఇంటర్ మూల్యాంకన కేంద్రం తనిఖీ



మూల్యాంకన కేంద్రంలో అధికారులతో శ్రీనివాసరావు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల పేపర్ మూల్యాంకన కేంద్రాన్ని సోమవారం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా వసతుల కల్పనపై క్యాంప్ ఆఫీసర్ హెచ్.వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రిన్సిపాల్ సంధ్యారాణికి ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ



వంట పాత్రలు అందజేస్తున్న ఎంఈఓ

జూలూరుపాడు: పీఎం పోషణ కార్యక్రమంలో భాగంగా సోమవారం జూలూరుపాడు పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాలలకు వంట పాత్రలు ఎంఈఓ బానోత్ జుంకీలాల్ పంపిణీ చేశారు. హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్(హెచ్‌ఏసీఏ) సహకారంతో మండలంలోని 42 ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు అందజేసిన వంట పాత్రలు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈఓ జుంకీలాల్ అందజేశారు. కార్యక్రమంలో జూలూరుపాడు కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నేతాజీ, పలు పాఠశాలల హెచ్ఎంలు గోపాల్, సునీతతోపాటు శ్రీనివాసరావు, కృష్ణ, మహేశ్, రమణ, పద్మ, శ్రీనివాస్, నాగేశ్వరరావు, సాంబశివరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్య నభ్యసిస్తున్న విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఓ టీచర్ ద్వారా ఎన్ఆర్ఐలు రూ.40 వేల విలువ గల పలు రకాల పుస్తకాలను అందజేశారు. మండలంలోని జగన్నాథపురం జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.దుర్గాశైలజ విజ్ఞప్తి మేరకు వాసవి సోషల్ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికాకు చెందిన (పుస్తకమిత్ర) బృందం పుస్తకాలను అందజేయగా వాటిని ఇటీవల ఎంపీడీఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి, కొత్వాల శ్రీనివాసరావు అందించారు.

క్షయపై అవగాహన ఉండాలి



ఇల్లెందురూరల్: కొమరారంలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



టేకులపల్లి: పీహెచ్‌సీ నుంచి ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యులు, సిబ్బంది

పాల్వంచరూరల్: క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలని జగన్నాథపురం గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులు రాజు అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని పెద్దమ్మగుడి వద్ద గల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. క్షయ లక్షణాలు కలిగిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణప్రసాద్, హెచ్ఏ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు మండలంలో..

ఇల్లెందురూరల్: జాతీయ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా రొంపేడు, కొమరారం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కవిత, లోహిత మాట్లాడుతూ.. క్షయ వ్యాధి ఊపిరితిత్తులకు సంబంధించినదైనా చర్మం నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యాధి సోకినట్లు అనుమానం కలిగిన వారు వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకొని క్రమం తప్పకుండా మందులు వాడాలని చెప్పారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మేరకు సోమవారం పీహెచ్‌సీ నుంచి ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించిన అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కె.వెంకటేశ్, ఆయుష్ వైద్యాధికారిణి విజయశ్రీతో పాటు వజ్జా పార్వతి, చంద్రకళ, దేవా, నాగుబండి వెంకటేశ్వర్లు, కౌసల్యసింగ్, గుజ్జా విజయ, రాజు, నాగలక్ష్మి, ధరణి, శైలజ, రుక్సానా, రజిత, విజయ, కిరణ్‌కుమారి, సైదమ్మ, వెంకటరమణ, ధనసరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: క్షయ వ్యాధిని తరిమి కొట్టాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎం.రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

‘సీతారామ’ పనులు పూర్తి చేయాలి



లింక్ కెనాల్‌ను పరిశీలిస్తున్న చంద్రావతి, నాయకులు

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్ట్ పనులు త్వరగా పూర్తి చేసి ఆయకట్టుకు నీరందించాలని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి డిమాండ్ చేశారు. ఏన్కూర్ లింక్ కెనాల్, సీతారామ మెయిన్ కెనాల్ పనులను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కెనాల్ పనులు పూర్తికాక ముందే గోదావరి జలాలను విడుదల చేసి హడావుడి చేసిన ప్రభుత్వం .. ఆ తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా అదనపు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని, మెయిన్ కెనాల్‌లో భూములు కోల్పోయిన రైతాంగానికి నష్టపరిహారం అందించాలన్నారు. నాయకులు భూక్యా వినోద్‌కుమార్, ఇటుకల రాజు, షేక్ బాజీ, ఎస్.కే.చాంద్‌పాషా, భూక్యా ధర్మానాయక్, నరేశ్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగం కళ్లల్లో కారం కొట్టి సీతారామ ప్రాజెక్ట్ జలాలను తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఖమ్మం జిల్లాకు తరలించారని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం జూలూరుపాడు మండలం వినోభానగర్ గ్రామ సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనులను సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని గోదావరి జలాలను ఇక్కడి రైతాంగానికి ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు తీసుకెళ్లడం దారుణమన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్ట్ మొదలుకొని సీతారామ ప్రాజెక్ట్ వరకు నీటి కేటాయింపుల్లో ఈ జిల్లా రైతులకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ ప్రారంభమైన అశ్వాపురం మొదలుకొని ఈ జిల్లా సరిహద్దు మండలమైన జూలూరుపాడు వరకు సీపీఎం బృందం పర్యటించి, పరిశీలించిందని, భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకు నష్టపరిహారం అందించలేదని, జిల్లా రైతాంగానికి సాగునీరు అందించిన తరువాతే మిగులు జలాలను సాగర్ ఆయకట్టు భూములకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజే రమేశ్, అన్నవరపు కనకయ్య, కె.బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాసరావు, అన్నవరపు సత్యనారాయణ, యాసా నరేశ్, గార్లపాటి వెంకటి, గడిదేశి కనకరత్నం, రాచబంటి కోటేశ్వరరావు, జల్లిక రాధాకృష్ణ, బొల్లి లక్ష్మయ్య, బోడా అభిమిత్ర, ధరావత్ రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యతోనే పునాది



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న ఎంఈఓ

టేకులపల్లి: ప్రాథమిక విద్య విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వంటిదని ఎంఈఓ జగన్ అన్నారు. సోమవారం మండలంలోని బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో కంటే ఎన్నో మార్పులు వచ్చాయని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా విద్యాబోధన ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతిరాణి, ఉపాధ్యాయులు జర్పుల పద్మ, నీరజ షారోన్, సీఆర్పీ అబ్బయ్య పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న కొత్వాల

పాల్వంచరూరల్: యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దంతలబోరు గ్రామ పంచాయతీలోని గంగాదేవిగుప్ప గ్రామంలో నిర్వహించిన ఐదు మండలాలస్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో నాగా సీతారాములు, బాదార్ల జ్యోషి, బాలినేని నాగేశ్వరరావు, పైడిపల్లి మహేశ్, బోడా శ్రీలతారెడ్డి, నాగరాజు, కోండ్రు ప్రసాద్, శాంతివర్ధన్, వెంకట్, బానోతు బాలాజీ, అరుణారెడ్డి, మాదార్, బోడా నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



సింగరేణి(కొత్తగూడెం): కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ఇల్లెందు: కాగడాల ప్రదర్శన చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సామ్రాజ్యవాద మదోన్మాద వ్యతిరేక పోరాటమే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పాత డిపో నుంచి రైల్వేస్టేషన్ వరకు లౌకిక సందేశ్ (కొవ్వొత్తుల) ర్యాలీ నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. మాతృదేశం కోసం చిన్న వయసులోనే చిరునవ్వుతో ఉరికంభం ఎక్కి భారత జాతీయ ఉద్యమానికి దిశా నిర్దేశం చేసిన గొప్ప విప్లవకారులని తెలిపారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలో కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుగ్గవాగు బ్రిడ్జి వద్ద గల భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రావూరి ఉపేందర్, గౌని నాగేశ్వరరావు, సారంగపాణి, ఎండీ రాసుద్దీన్, వరప్రసాద్, కె.శ్రీనివాస్, మండల వెంకన్న, ఆర్.నర్సింహారావు, బి.రాజా, ఎస్.శ్రీనివాస్, పీడీఎస్‌యూ పీవైఎల్ కార్యకర్తలు పాల్గొన్నారు.